క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు



ఉగాది వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

బాలానగర్: బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉగాది పండగ సంబురాలు వైభవంగా జరిగాయి. కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, కొప్పిశెట్టి దినేష్, తూము వేణు, శేరి సతీష్‌రెడ్డి, పుష్పరెడ్డి, గంధం రాజు, గాలి బాలాజీ, కృష్ణరాజపుత్,ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ కార్యకర్తలకు క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

ఆల్విన్‌కాలనీ: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్లవెంకటేష్‌గౌడ్ డివిజన్ ప్రజలకు క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, పాండుగౌడ్, సీహెచ్.భాస్కర్, జి.రవి, గుడ్ల శ్రీనివాస్, సంగమేష్, అగ్రవాసు, యాదగిరి, మహేష్, వాలి నాగేశ్వరరావు, భిక్షపతి, సీహెచ్.రవి, జనార్దన్, మోజెస్ పాల్గొన్నారు.



ఉగాది వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

ట్రాఫిక్ సమస్యపై నజర్



ఏలియన్స్ చౌరస్తా

- పలుచోట్ల సిగ్నల్స్ ఏర్పాటుకు అధికారుల సూచన
- 4 ప్రమాద టర్నింగ్‌లు గుర్తింపు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వాహన రద్దీ పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో ప్రధాన కూడలి వద్ద సమస్యలు తప్పడం లేదు. ఈ క్రమంలో స్థానికులు కొద్దిరోజుల క్రితం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి.జోల్ డేవిస్‌ను కలసి వినతిపత్రం అందజేయగా ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిశీలించారు. పరిష్కారం కోసం అధికారులకు పలు సూచనలు చేశారు. శేరిలింగంపల్లి గోపనపల్లి , తెల్లాపూర్ మీదుగా రింగ్ రోడ్డు వరకు, శేరిలింగంపల్లి నలగండ్ల నుంచి తెల్లాపూర్ ఇందిరానగర్ కాలనీ మీదగా రింగ్ రోడ్డు వరకు 4 ప్రమాద మలుపులు ఉన్నట్లు గుర్తించారు. అదే విధంగా సాయిబాబ ఆలయం సమీపంలో వాహనదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. అందరి భాగ్యస్వామ్యంతో 7.6 కిలోమీటర్‌లు సుమారు 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి నిర్ణయించుకున్నారు. ఎలియాన్స్, రాజపుష్ప సమీపంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు వాహనాల వేగంను నియత్రించేందుకు జిగ్‌జాగ్‌లో బారికేడ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ నిబంధనలపై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ట్రాఫిక్ సమస్యను తెలుసుకుంటున్న సైబరాబాద్ ట్రాఫిక్ కమిషన్ డి.జోల్ డేవిస్ (ఫైల్)

వెంటనే స్పందించారు



తెల్లాపూర్, నల్లగండ్ల పరిధిలోని ట్రాఫిక్ సమస్యలను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించారు. మాకు చాలా సంతోషంగా ఉంది. త్వరలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం.

–రాంకుమార్, ఉస్మాన్‌నగర్

సమస్య పరిష్కారానికి కృషి



తెల్లాపూర్, నల్లగండ్ల పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాము. వాహనాల వేగాన్ని నియత్రించేందుకు పలుచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నాం. ట్రాఫిక్‌పై ప్రజలల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

– పవన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రాపురం

రంగనాథస్వామి ఉత్సవాలు ప్రారంభం

రాయదుర్గం: గోపన్‌పల్లి, పరిసర ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం రంగనాథస్వామి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకం, అలంకారం తదితర పూజలను నిర్వహించారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కుటుంబసమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు.

నేటి పూజలు..

గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయంలో రెండురోజుల ఉత్సవాలలో భాగంగా బుధవారం రెండో రోజు ఉదయం 6 గంటలకు ఆలయ సమీపంలోని సింగబావి వద్ద స్వామివారికి అవభృత స్నానం చేయిస్తారు. అనంతరం మేళతాళాలతో తిరిగి ఆలయానికి తీసుకొచ్చి పూజ చేస్తారు. భక్తుల దర్శనం అనంతరం ఉదయం 8.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో పంచాంగ పఠనం ఉంటుంది. అనంతరం ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

'ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ ఖాయం'

హిమాయత్‌నగర్: కేంద్రంలో బీజేపీ మరోసారి విజయం సాధించి, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని, ఉగాది పంచాంగంలో వేదపండితులు ఇదే విషయాన్ని స్పష్టం చేశారని ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. ఉగాది పండుగ ప్రతి ఒక్కరి ఇంటిలో వెలుగులను నింపాలని ఆకాంక్షించారు. మంగళవారం జరిగిన హిమాయత్ నగర్ డివిజన్‌లోని 18వ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మరోసారి సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ గెలిచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని, ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో బూత్ కమిటీ అధ్యక్షులు తుల్జా రామ్, శ్రీశైలం, రమేష్, రాజు, కార్తీక్, భరత్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రంజాన్, శ్రీరామనవమికి బందోబస్తు ఏర్పాటు

ఈస్ట్‌జోన్ డీసీపీ ఆర్.గిరిధర్

హిమాయత్‌నగర్: ప్రజలు ప్రశాంత వాతావరణంలో రంజాన్, శ్రీరామనవమి పర్వదినాలను జరుపుకోవాలని నగర ఈస్ట్ జోన్ డీసీపీ ఆర్.గిరిధర్ కోరారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీరామనవమి శోభయాత్రపై నిర్వాహకులతోపాటు అన్ని ప్రభుత్వ విభాగాలతో సమన్వయ సమావేశం నిర్వహిస్తామన్నారు. పీస్ కమిటీ సమావేశాలు నిర్వంహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ కూడా ఉన్న నేపథ్యంలో అన్ని రకాల భద్రతాచర్యలు కట్టుదిట్టంగా ఏర్పాటు చేశామని డీసీపీ తెలిపారు.

చంద్ర రాజేశ్వర్‌రావుకు ఘన నివాళి

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వర్‌రావు వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సభకు సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సురవరం సుధాకర్‌రెడ్డి, అధ్యక్షులు, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హాజరై మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. ప్రజలకు కోసం నిరంతరం తపించే వ్యక్తి అని కొనియాడారు. గత నాలుగు సంవత్సరాలుగా సీఆర్ ఫౌండేషన్ లీజు పునరుద్ధరణ గత ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. నేడు ఫౌండేషన్‌తో పాటు చారిటబుల్ సంస్థ లీజు పునరుద్ధరించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చంద్ర రాజేశ్వర్‌రావుకు నివాళులర్పించిన వారిలో సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కోశాధికారి చెన్నకేశవరావు, ఏఐటీయుసి మాజీ జాతీయ కార్యదర్శి విజయలక్ష్మి, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ కృష్ణకుమారి, వృద్ధాశ్రమం సలహా కమిటి సభ్యులు డాక్టర్ సరస్వతి, రాజేందర్‌రావు, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమవాసులు ఉన్నారు.

తారానగర్‌లో బీజేపీ ప్రచారం

శేరిలింగంపల్లి: దేశంలో ఎక్కడికి వెళ్ళినా 'మోడీ' నినాదమే వినిపిస్తోందని చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శేరిలింగంపల్లి లోని తారానగర్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన బీజేపీ ఎన్నికల ప్రచార సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం ఈ స్థాయిలో అభివృద్ధి సాధించిందంటే కేవలం ప్రధాని మోడీ నాయకత్వంతోనే సాధ్యమైందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ వైఫల్యంతో అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ఆగం ఆగం అవుతోందన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికలలో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, పార్లమెంటు ఇన్‌చార్జ్ మల్లారెడ్డి, నాయకులు రాఘవేందర్‌రావు, బుచ్చిరెడ్డి, ఎల్లేష్, నవతారెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా ఎందుకు మార్చలేకపోయారు?

తెల్లాపూర్ రైల్వేస్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణంకు కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెలంగాణ ఉద్యమం సమయంలో బీఆర్‌ఎస్ నేతలు తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పేరు మారుస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం బీహెచ్‌ఈఎల్ జిల్లాపరిషత్ పాఠశాల ప్రాంగణంలో ఆయన వాకర్స్‌తో మాట్లాడారు. యువకులతో క్రికెట్ ఆడారు. కీర్తిమహల్ బస్టాండ్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో వాకర్స్, ప్రజలతో మాట్లాడారు. స్థానిక యువకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కాలనీ యువకులతో కలసి ఆయన తెల్లాపూర్ రైల్వే స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్, విద్యుత్‌నగర్ కాలనీ వాసులు తెల్లాపూర్ రైల్వేస్టేషన్‌కు రావడానికి సరైన మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారని, దీంతో లింగంపల్లికి వెళ్ళి ఎంఎంటీఎస్ రైలు ఎక్కుతున్నారని తెలిపారు. తెల్లాపూర్‌లో ఓటు హక్కు ఉందని చెప్పే నేతలకు ఇక్కడ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే వేలాదిమందికి రైల్వేస్టేషన్, ఎంఎంటీఎస్ రైలు ఉపయోగపడుతుందని తెలియదా అని ప్రశ్నించారు. తాను గెలిచిన వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించి రేడియల్ రోడ్డు నెంబర్ 7, రింగ్‌రోడ్డుకు అనుసంధానం చేసే విధంగా కృషి చేస్తానన్నారు. దేశ కీర్తి, ప్రతిష్టలను పెంచుతున్న నరేంద్రమోదీని ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.



చలివేంద్రాలు.. దాహార్తిని తీర్చే కేంద్రాలు

మోతీనగర్: ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ మోతీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఐ మహమ్మద్ జాఫర్ ఆలీ పేర్కొన్నారు. ఉగాది పండుగ సందర్భంగా మోతీనగర్‌కు చెందిన శ్రీ శివరామాంజనేయ దేవాలయ ప్రధాన సేవకుడు రమేష్ అయ్యంగార్ తండ్రి దివంగత రాజగోపాలన్ పేరిట మూసాపేట డివిజన్ పరిధిలోని కబీర్‌నగర్ బస్‌స్టాప్, మోతీనగర్ కమ్యూనిటీహాల్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎస్‌ఐ మహమ్మద్ జాఫర్ ఆలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ అయ్యంగార్ మాట్లాడుతూ.. పదేళ్లుగా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. నిరంతరం ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంతైనా సమాజ అభివృద్ధి కోసం వెచ్చించినట్లయితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.



రమేష్ అయ్యంగార్ ఏర్పాటు చేసిన ఫ్రిజ్‌ను ప్రారంభిస్తున్న సనత్‌నగర్ పోలీసులు

ఎన్నికలు.. తనిఖీలు.!

మోతీనగర్: ఎన్నికల తనిఖీల్లో భాగంగా అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్యాంక్ కాలనీ వద్ద మంగళవారం అల్లాపూర్ పోలీసుల తనిఖీలు చేపట్టారు. సీఐ సామల వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఎన్నికల్లో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారుల వెంబడి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. అనుమానస్పదంగా ఉన్న వ్యక్తుల వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి వాహనాల్లో రూ.50వేలకు మించి నగదు తరలించినా.. విలువైన వస్తువులను పెద్ద ఎత్తున తరలించినా వారిపై ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అల్లాపూర్ డివిజన్ బ్యాంక్ కాలనీ వద్ద సిఐ సామల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేసిన అల్లాపూర్ పోలీసులు

ఆధునిక కోర్సులపై యువత ఆసక్తి

- ఎస్కీ డైరెక్టర్ డా.రామేశ్వరరావు
- ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై యూఎస్‌లోని 'యూఈటీ'తో 'ఎస్కీ' ఒప్పందం

రాయదుర్గం: నేటి తరం యువత ఆధునిక కోర్సులకు మొగ్గు చూపుతున్నారని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీపై అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌తో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా మంగళవారం ఓ ఒప్పందం కుదుర్చుకుంది. ఇరు సంస్థలకు చెందిన అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత ఆసక్తిని చూసి ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ కోర్సులలో భాగంగా 5జీ టెక్నాలజీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ టెక్నాలజీ తదితర ఆధునిక కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఇక్కడి యువతకు శిక్షణ ఇచ్చి వారి ఉజ్వల భవితకు తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకున్నామన్నారు. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన యూనివర్శిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీతో ఒప్పందంతో యువతకు మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్కీ కార్యాలయ చీఫ్ లక్ష్మీకాంతరావు, పలు డివిజన్లకు చెందిన హెడ్స్, యూనివర్శిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీ అసోసియేట్ వైస్‌చాన్స్‌లర్ చంద్ర ఎస్ దపక, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్ మావూడూరి, ఆర్‌డీవి ప్రసాద్, ఇరు సంస్థల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో డా.రామేశ్వరరావు, యూఈటీ అసోసియేట్ వీసీ చంద్ర ,ఇరు సంస్థల అధికారులు

నేడు శ్రీమద్‌రామాయణ ప్రవచనం

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీశారదా శంకరమఠంలో 10 నుంచి 16వ తేదీ వరకు శ్రీ మద్‌రామాయణం ప్రవచనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు శంకర మఠం పరిపాలన అధికారి సీఎస్ఆర్ మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 6 నుంచి 8గంటల వరకు బ్రహ్మశ్రీ ముదిగొండ శంకర శర్మ ప్రవచనం చేస్తున్నారు. కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

కూరగాయల సంత

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్‌లో ప్రతి బుధవారం వారాంతపు కూరగాయల సంత కొనసాగుతుంది. ఈ సంతలో తాజా కూరగాయలతో పాటు పండ్లు, పూలు, నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు అందుబాటులో ఉంటాయి.

అలరించిన నృత్యప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా మంగళవారం శ్రీమాన్ పెద్దింటి వెంకట భాస్కర సత్యనారాయణచార్యులు పంచాంగ పఠనం చేశారు. ద్వాదశరాశులకు వార్షిక రాశి ఫలాలు, గ్రహ గమనం, గ్రహణ విశేషాలు, సంవత్సర విశిష్టతను తెలిపారు. అనంతరం భాస్కర కూచిపూడి డ్యాన్స్ అకాడమీ గురువు సాత్విక శిష్యబృందం నృత్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ శోభరాజు కళాకారులను సత్కరించారు.

రాంజీ గోండు స్ఫూర్తితో పోరాడతాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆదివాసీ విధానాలపై రాంజీ గొండు స్ఫూర్తితో పోరాడుదామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాంజీ గొండు 164వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు సింహ స్వప్నంగా ఆదివాసీ పోరాటాలు జరిగాయన్నారు. రాంజీగొండు సంతులాల్ తిరుగుబాటు ప్రజల్లో ఉత్సాహాన్ని నింపిందని కొనియాడారు. ఆర్.శ్రీరామ్‌నాయక్, ఎం.వీ. రమణ, ఆశయ్య, నరేష్, స్కైలాబ్‌బాబు, జాన్‌వేస్లీ, మూడ్ శోభన్‌నాయక్ పాల్గొన్నారు.

మెట్రో డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

భాగ్యనగర్‌కాలనీ: ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పిన ఓ లారీ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదర్‌నగర్ మైసమ్మ టెంపుల్ సమీపంలో మియాపూర్ నుంచి కేపీహెచ్‌బీకాలనీ వైపుకు వస్తున్న లారీ (టీఎస్ 08 యూఎస్ 5868) ముందుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవటంతో అందరూ ఊపిరి పీలుచుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటన జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాది నాటకోత్సవాలు షురూ

ఫిలింనగర్: ఫిలింనగర్ ఫిలింఛాంబర్ ఆవరణలోని రామానాయుడు కళామండపంలో ఉగాది పండుగ సందర్భంగా ప్రతియేటా నిర్వహించే రంగస్థల నాటకోత్సవాలు మంగళవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ నాటకోత్సవాల్లో భాగంగా తొలిరోజు గుణనిధి నాటకాన్ని ప్రదర్శించారు. శ్రీకృష్ణుడిగా ఎ.కోటేశ్వర్‌రావు, అర్జునగా నంది అవార్డుగ్రహీత మంగాదేవి నర్తించారు. శ్రీనాథ కవిసార్వభౌమ కాశీఖండం మూలకథ నుంచి సేకరించిన కథతో కొట్టే వెంకటాచార్యులు నాటక రచన చేశారు. గుణనిధిగా వెంకట సాయిచంద్, యజ్ఞదత్తుడిగా కొట్టే వెంకటాచార్యులు, మార్తండవర్మగా మంతోజు సాళ్యాచారి, మతిమంతుడుగా ప్రసాదరాయ శాస్త్రి కోరుకొండ, విశారదుడుగా జంగయ్యగౌడ్ నటించారు. కాగా, ఈ నాటికకు హార్మోనియం అబ్బూరి వెంకటస్వామి, కీబోర్డు సీహెచ్ వెంకటరావు, డోలక్ వి.బ్రహ్మీ, దర్శకత్వం రాజనాల సత్య సహకారం అందించారు. ఈ నాటికను ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ, సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ, నిర్వాహకులు పొత్తూరి వెంకటసుబ్బారావు హాజరై వీక్షించారు. పెద్ద ఎత్తున విచ్చేసిన కళాభిమానుల మధ్య కళాకారులు ఉత్సాహంగా నాటికను ప్రదర్శించారు.



నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు...

నీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే సంప్రదించండి

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరాలో ఇబ్బందులు, సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ కోరారు. మున్సిపాలిటీ పరిధిలో వస్తున్న నీటి సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరించేందుకు జలమండలి అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను 155313, 18005997575 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

రంజాన్ తోఫా అందజేత

పటాన్‌చెరు టౌన్: ఎండిఆర్ ఫౌండేషన్ కో ఫౌండర్ పృథ్వీరాజ్ ముస్లింలకు రంజాన్ తోఫాను అందజేశారు.మంగళవారం పట్టణంలోని ఎండిఆర్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద పంపిణీ అనంతరం ఆయన మాట్లాడుతూ పండుగను సంతోషంగా చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది పండగకు ముందు రంజాన్ తోఫాను అందజేస్తున్నామన్నారు అదేవిధంగా పేద మహిళలకు చీరల పంపిణీ కూడా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎండిఆర్ అధ్యక్షుడు మధు, సభ్యులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

జిల్లా భూగర్భ జలశాఖ అధికారి రేవతి



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూగర్భ జలమట్టం గణనీయంగా పడిపోతున్న నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా భూగర్భ జలశాఖ అధికారి రేవతి సూచించారు. గత నెల మార్చిలో జిల్లాలో భూగర్భ జలమట్టం 12.45 మీటర్ల లోతున ఉండగా, గతేడాది మార్చిలో 9.50 మీటర్ల లోతు నమోదైనట్లు ఆమె పేర్కొన్నారు. గతేడాదితో పోల్చుకుంటే జిల్లా సరాసరి నీటి మట్టం దాదాపు మూడు మీటర్ల లోతుకు పడిపోయాయన్నారు.గతేడాది మార్చితో పోల్చుకుంటే ప్రస్తుతం జిల్లాలో అత్యధికంగా ఎంసీపల్లిలో 10.46 మీటర్లు, కూకట్‌పల్లిలో 6.90, కుత్బుల్లాపూర్‌లో 3.50, బాచుపల్లిలో 2.86 మీటర్ల లోతుకు భూగర్భ జల నీటిమట్టం పడిపోయిందన్నారు. భూగర్భ జలమట్టం తగ్గుదల నేపథ్యంలో రైతులు పంట మార్పిడికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అలాగే, జిల్లా ప్రజలు చట్టప్రకారం బోరు బావుల తవ్వకాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కోరారు. రానున్న ఎండాకాలంలో నీటి ఎద్దడిని అధిగమించడానికి నీటిని పొదుపుగా, అవసరానికి తగ్గట్లు వాడుకోవాలన్నారు. ఇంకుడు, గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం, నివాస అపార్టుమెంట్లు, గ్రూప్ హౌసింగ్ సొసైటీలు, వాణిజ్య వినియోగం, పారిశ్రామిక అవసరాలు, మౌలిక సదుపాయాల వినియోగం, మైనింగ్ ప్రాజెక్టులు, ప్యాకేజ్‌డ్ వాటర్ సప్లై, బల్క్ వాటర్ సప్లై వినియోగానికి భూగర్భజల అధికారి నుంచి ఎన్‌ఓసీ పొందడం తప్పనిసరని ఆమె తెలిపారు. అలాగే, బోర్వేల్ డ్రిల్లింగ్ కోసం టీఎస్ఐ పాస్ వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో రిగ్గులన్నీ భూగర్భజల శాఖ కార్యాలయంలో రిజిష్టర్ చేసుకోవాలని ఆమె కోరారు.

శ్రీరామనవమి ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ,నాయకులు

పటాన్‌చెరు: శ్రీరామనవమిని పురస్కరించుకొని..పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఏప్రిల్ 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం వేద పండితుల సమక్షంలో లగ్న పత్రికను రూపొందించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్,మాజీ కార్పొరేటర్ సపానదేవ్, గూడెం మధుసూదన్‌రెడ్డి, పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.